క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపురం : మండలంలోని 11 కేవీ, 33 కేవీ విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ విద్యా సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్


పోలీసుల అదుపులో కోడి పందెం రాయుళ్లు

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలి సమీపంలో కోడి పందేలు ఆడుతున్న ఆరు మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. శుక్రవారం కోడి పందేలు ఆడుతున్న సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో స్థావరంపై దాడి చేశారు. పందేలు ఆడుతున్న వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 1500 నగదుతో పాటు ఐదు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌లలో గురువు పాత్రపై సెమినార్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ ఆధ్వర్యంలో 'ఇంటర్న్‌షిప్‌లలో గురువు పాత్ర' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలకు చెందిన రీసోర్స్ పర్సన్ డాక్టర్ శామ్యూల్ దయాకర్ హాజరై ఒక మెంటర్, మెంటర్ పాత్ర, ఇంటర్న్‌షిప్‌లలో అడ్డంకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆంథోని పాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రమణారెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


సింహాద్రిపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కెఎస్ఆర్ఎం కళాశాల వద్ద సీకేదిన్నె ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేదుకు ఈ తనిఖీలు చేపట్టామన్నారు. ప్రతి వాహనదారుడు తప్పకుండా వాహనానికి చెందిన పత్రాలతో పాటు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

సింహాద్రిపురం : వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన లైసెన్స్‌లు తప్పకుండా కలిగి ఉండాలని ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సింహాద్రిపురంలోని వెలిదండ్ల రోడ్డు, వైఎస్సార్ సర్కిల్ వద్ద ఆయన వాహణాల తనిఖీ నిర్వహించి రికార్డులు, లైసెన్స్‌లు లేనివారికి జరిమానాలు విధించారు. ఏఎస్ఐ హాజి బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కొత్తరోడ్డు మీద పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టి వాహన రికార్డులను పరిశీలించారు. ముందస్తు చర్యలుగా వాహనాల తనిఖీ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, పోలీసులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ శాంతికళ

ఎర్రగుంట్ల : స్థానిక రాణీవనంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్మీడియట్ ప్రశ్న పత్రాలు


ప్రశ్న పత్రాలను దించుకుంటున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : ఈనెల 15వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల ప్రశ్నపత్రాలు సెట్–3 జమ్మలమడుగు పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం చేరుకున్నాయి. దీంతో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్ స్టేషన్‌కు వచ్చి ప్రశ్న పత్రాలను పార్సెల్ కౌంటింగ్ చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అధికారుల సమక్షంలో వాటిని భద్ర పరిచారు. పట్టణంలో ప్రభుత్వ బాలుర, బాలికల, వివేకానంద సాయి పరమేశ్వర కళాశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

పులివెందుల టౌన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం పట్టణంలోని భాకరాపురంలో పర్యటించి పట్టభద్రులను ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గండి రాము, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, సంపత్, నాగరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.


పులివెందులలో పట్టభద్రుడిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు


ఎర్రగుంట్లలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ బలపరచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం పట్టణ పరిధిలోని కుప్పూరువారిపల్లెలో కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థులైన రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు తమ ప్రథమ ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి అభ్యర్థులను ఎంపిక చేశారని, వారిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మస్తానయ్య, షావలి, ప్రసాద్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో ఆయన ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్ రెడ్డి, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు ప్రచార గడువు ముగియనుండటంతో మండలంలో ప్రచారాలు ఊపందుకున్నాయి. ఇరుపార్టీల అభ్యర్థుల గెలుపునకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీర ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి శుక్రవారం మండలంలోని పాయసంపల్లె, అలిదెన, అడవిచెర్లోపల్లె, వీరపునాయునిపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వీరపునాయునిపల్లె ఎంపీటీసీ రాఘవ యాదవ్, పాయసంపల్లె సర్పంచు చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, నాయకులు సుమన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, దేశాయ్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ప్రతాప్‌యాదవ్, తిరుమల్‌రెడ్డి లు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల సచివాలయ కన్వీనర్ రామమోహన్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని జీసీపల్లె, చీమలపెంట గ్రామాల్లో శుక్రవారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గౌరిశంకర్‌రెడ్డి, రామాంజనేయ రెడ్డి, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి శుక్రవారం మండలంలోని కల్లుట్ల, ఎ.కంబాలదిన్నే, రేగడిపల్లె, వద్దిరాల, గొల్లపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ చైర్ పర్సన్ లీలావతి శివగుర్విరెడ్డి, జడ్పీటీసీ మహలక్ష్మీ, సర్పంచులు జయశ్రీ, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, హుసేన్‌రెడ్డి, బాషా, లక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : స్థానిక 1వ సచివాలయ పరిధిలోని తూర్పు దళితవాడ, మైనార్టీ కాలనీలలో మైనార్టీ నాయకులు వారిస్, హజ్రత్, రెండవ సచివాలయ పరిధిలో మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, మూడవ సచివాలయ పరిధిలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డిలు కొత్త గాంధీనగర్, అరుంధతినగర్, కేఓఆర్‌కాలనీలలో, అలాగే మండలంలోని కొండపేటలో సర్పంచ్ తుంగ చంద్రశేఖర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో, రామనపల్లె గ్రామంలో రామన చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రచారం నిర్వహించారు.

వల్లూరు : వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డిలు ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల వైఎస్ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

వేంపల్లె : స్థానిక పులివెందుల-కడప బైపాస్‌లో అయ్యప్పస్వామి నూతన ఆలయం నిర్మించిన నేపథ్యంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప విగ్రహ ప్రతిష్టలో భాగంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ అనంతరం స్థానిక పాతపేటలోని భవాని నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి అయ్యప్పస్వామి వినాయక, సుబ్రమణ్యేశ్వర, లక్ష్మీదేవి విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా చెక్కభజన, తాళాలతో ఊరేగించారు. నేడు శనివారం వివిధ పూజాది కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యుడు ఎస్.నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ట, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి గ్రామోత్సవం

తాగునీటి సమస్యలపై దృష్టి సారించండి

వేంపల్లె : వచ్చే వేసవి మొదలు కానున్న నేపథ్యంలో అధికారులు తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులతో ఆయన సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. అందుకు ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, భారతిలో పాతపేట, చైతన్యనగర్, అమ్మవారిశాల వీధి, ఉషాకిరణ్ స్కూలు వీధి తదితర ప్రాంతాలలో పాపాఘ్ని నది నుంచి గత మూడేళ్ల నుంచి తాగునీరు రావడంలేదన్నారు. గత సమావేశంలో ఈ విషయాన్ని దృష్టికి తీసుకొచ్చినప్పటికి పరిష్కారం కాలేదన్నారు. అందుకు ఎంపీడీఓ స్పందించి వారం లోపు గ్రామ పంచాయతీలో మీటింగ్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు మెహతాజ్, రమణమ్మ, ఎంపీటీసీలు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీ పావని, జగన్నాథరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని చీమలపెంట దళితవాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీతారామస్వామి విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నూతన విగ్రహాలకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

పోలింగ్ బూత్‌ల తనిఖీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌లలో అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయాలని, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తాహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


బూతులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

కమలాపురం : ఈనెల 13వ తేదీన జరగనున్న పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ నారాయణరెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో పట్టభద్రులకు ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని ఆయన అన్నారు.

ఘనంగా గుంటి లక్ష్మణస్వామి ఆరాధన

లింగాల : మండలంలోని కర్ణపాపాయపల్లెల్లో వేలసిన భూలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న సద్గురు గుంటి లక్ష్మణస్వామి ఆలయంలో గణపతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం లక్ష్మణస్వామి విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి, హారతి కార్యక్రమాలను స్వామి వంశీకులు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, శాంతి, విజయ, తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సిబ్బందికి వీడ్కోలు

కడప స్పోర్ట్స్: కడప నగరం వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో పని చేస్తూ పదోన్నతిపై వెళ్తున్న ఖేలో ఇండియా స్టేట్ ఎక్స్‌లెన్స్ సెంటర్ సిబ్బందికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎక్స్‌లెన్స్ సెంటర్‌లో న్యూట్రీషియనిస్టుగా పని చేస్తున్న కె.శరణ్య పంజాబ్ రాష్ట్రం పటియాలలోని ఎన్ఎస్ఎన్ఐఎస్‌కు, ఫిజియోథెరపిస్టు మహమ్మద్ జునైద్ వాహీద్ బెంగళూరులోని సాయ్ సెంటర్‌కు పదోన్నతిపై వెళ్లారు. వారికి శుక్రవారం కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎస్.బాషామోహిద్దీన్, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పదోన్నతిపై వెళ్తున్న వారితో వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

రేపు విద్యుత్ కోతలు

పులివెందుల రూరల్ : ఈ.కొత్తపల్లె పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ కోతలు ఉంటాయని విద్యుత్‌శాఖ ఏఈ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఐజికార్ల్ సమీపంలో ఉన్న 33/11కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్, 33/11కె.వి కొత్తపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్టీపీపీలో భద్రతకు ప్రాధాన్యత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో శుక్రవారం భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్మికుడు భద్రతా పరికరాలు ధరించాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణ, సీనియర్ ఎస్ఈ దేవేంద్రనాయక్, ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, డీవైసీసీ రమణారావు, డీఈ ఫ్యాక్టరీ మేనేజర్ ఎన్.సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న కుటుంబ సభ్యులు

వేముల : మండలంలోని గొందిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కలంకుంట్ల జయచంద్రారెడ్డి తన కుమారుడు గంగాప్రసాద్ రెడ్డి 3వ వర్ధంతిని పురస్కరించుకుని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు సావిత్రిబాయి పూలే

పులివెందుల టౌన్ : సావిత్రిభాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త, చిరస్మరణీయురాలు అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గొప్ప సంఘ సంస్కర్త సావిత్రి భాయిపూలే వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే అంటరానితనం, స్త్రీ విద్య కోసం ఎంతో పాటుపడిందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, రవి, నాగరాజు, సంపత్, చలపతి, రాజశేఖర్, కుళ్లాయప్ప, బాదుల్లా, బాబావల్లి, శేఖర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : కుల వివక్షను ఎదుర్కొని ఆడపిల్లలకు చదువులు చెప్పిన చదువులతల్లి సావిత్రిబాయి పూలే అని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మేకల ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఎస్సీ కాలనీలో సావిత్రి బాయి పూలే 129వ వర్ధంతి వేడుకల సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల కసరత్తు

నియోజకవర్గంలో 934 ఉపాధ్యాయుల, 10,477 పట్టభద్రుల ఓట్లు

జమ్మలమడుగు : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరాహోరిగా సాగింది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో అధికారులు సైతం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఆయా మండలాల కేంద్రాలలో అధికారులు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు, టీడీపీ నాయకులు, పీడీఎఫ్ పార్టీ స్వతంత్ర అభ్యర్థులు ప్రచారాలు నిర్వహించారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 934 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా అత్యధికంగా 478 మంది జమ్మలమడుగు పట్టణంలోనే ఉన్నారు. అత్యల్పంగా పెద్దముడియం మండలంలో కేవలం 23 మంది ఉన్నారు. పట్టభద్రులకు సంబంధించిన ఆరు మండలాల్లో 10,477 మంది ఓటర్లు ఉన్నారు. అందులో జమ్మలమడుగు మండలంలో అత్యధికంగా 3,280 మంది కాగా రెండో స్థానంలో ఎర్రగుంట్ల మండలంలో 2,832 మంది పట్ట భద్రులు ఉన్నారు. వీరందరికి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఎర్రగుంట్లలో రెండు, ఆర్టీపీపీలో ఒకటి పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం కోసం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డితోపాటు మండలాల్లోని స్థానిక నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన పి.రామసుబ్బారెడ్డి తన అనుచరులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తున్నారు.

జమ్మలమడుగు నియోజకవర్గంలో

	ఉపాధ్యాయ ఓటర్లు	పట్టభద్రులు
జమ్మలమడుగు	478	3280
మైలవరం	87	1100
పెద్దముడియం	23	650
కొండాపురం	43	1475
ముద్దనూరు	87	1146
ఎర్రగుంట్ల	216	2832
మొత్తం	934	10,477

పనులను నాణ్యతతో పూర్తి చేయండి

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి శుక్రవారం పరిశీలించారు. దుగ్గాయపల్లెలో జరుగుతున్న దత్తాత్రేయస్వామి, గంగమ్మ ఆలయాల నిర్మాణ పనులతోపాటు పాపాఘ్ని నది నుంచి దుగ్గాయపల్లె పొలాలకు వున్న ఏటి కాలువల కాంక్రీట్ వాల్ పనులను ఆయన పరిశీలించి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేత మునీంద్రారెడ్డి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

పిలిచి అవమానించడం ఎందుకు

– పాల ఏకిరి సంఘం రాష్ట్ర డైరెక్టర్ సభాపతినాయుడు

చక్రాయపేట : యువగళం పాదయాత్ర సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాలఏకిరి కులస్థులను ఆహ్వానించి ఎందుకు అవమానించి పంపారని ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ పాతపాలెం సభాపతి నాయుడు మండిపడ్డారు. పాల ఏకిరిలతో సమావేశం అవుతానని చెప్పినట్లు ఆపార్టీ నేతలు పత్రికా ముఖంగా ప్రకటన ఇచ్చారని చెప్పారు. ఈమేరకు పాల ఏకరి కులస్థులు లోకేష్‌తో మాట్లాడేందుకు వెళ్లారని అయితే లోకేష్ వారితో మాట్లాడకుండా కేవలం అర్జీ తీసుకుని పంపారని చెప్పారు. దీంతో పాల ఏకరి కులస్థులు తమను లోకేష్ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహానేత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాల ఏకిరిలను బీసీ జాబితాలో చేర్చారన్నారు. దీంతో తమ కులానికి చెందిన అనేక మంది ఉన్నత చదువులు చదివి బీసీ కోటాలో ఉద్యోగాలు కూడా చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కూడా పాల ఏకిరి సంఘం అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేశాడన్నారు. పాల ఏకిరిలను అవమానించిన లోకేష్ బహిరంగంగా క్షమాపన చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

సింహాద్రిపురం : జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నులి పురుగుల మాత్రలు మింగిన తర్వాత విద్యార్థులకు కడుపు నొప్పి ఉంటుందని.. దీనిపై ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఏడాది నుంచి 18 ఏళ్లలోపు 2,959 మంది విద్యార్థులు ఉన్నారని.. వారందరికీ మాత్రలు వేసేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

చింతకొమ్మదిన్నె : మండలంలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణలో భాగంగా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం చింతకొమ్మదిన్నెలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆశా వర్కర్లకుతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన 1 నుంచి 2 సంత్సరాల లోపు గల పిల్లలకు 200 గ్రాములు, 19 సంవత్సరాలలోపు పిల్లలకు 400 గ్రాముల మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్‌రెడ్డి, ఎంఈవో వెంకటరామిరెడ్డి, సీహెచ్‌వో సుకుమార్, ఎంపీహెచ్ఎస్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : ఈనెల 14వ తేదీన జరగనున్న జాతీయ డీ వార్మింగ్ డే ను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ శుక్రవారం కార్యాలయంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, శానిటరీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి తెలిపారు. 19 ఏళ్ల వయస్సు లోపు పిల్లలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న నులిపురుగుల నివారణ మాత్రలను ప్రతి విద్యార్థికి పంపిణీ చేయాలని వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్నకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం (రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్ రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు, ప్రోస్టేట్ గ్రంథి సమస్యలు తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించాలనుకునేవారు పడగడపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ తాడేపల్లి ఆధ్వర్యంలో కమలాపురం గురుకుల పాఠశాలలో 5వ తరగతి నందు ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులను ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను మార్చి 24వ తేదీలోపు నెట్ సెంటర్ ద్వారా గాని, సమీపంలోని గురుకుల పాఠశాలల నుంచికాని ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చునని ఆమె అన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినులు ఎస్సీ, ఎస్టీలు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31లోగా జన్మించి ఉండాలన్నారు. అలాగే ఓసీ, బీసీ, ఎస్సీ కన్వెర్టెడ్ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31వ తేదీలోపు జన్మించి ఉండాలన్నారు. 2021-22లో 3వ తరగతి, 2022-23లో 4వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలన్నారు. కుటుంబం వార్షిక ఆదాయం రూ.1లక్ష మించి ఉండరాదన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 23వ తేదీన మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 వరకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తామని ఆమె అందులో పేర్కొన్నారు.

లింగాల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బలయోగి గురుకు ల కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థుల ప్రవేశ పరీక్షల కోసం ఆన్‌లైన్‌లో మార్చి 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.